# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-03-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రం లో గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఆందోళన చెందకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులకు సూచించారు.**
2. **అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఈ రోజు పర్యటిస్తున్నారు.**
3. **అమరావతి లో ఈ సంవత్సరం జూన్ నాటికి అధికారులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు నివాసాలు పూర్తవుతాయని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు.**
4. **'ఏక్ భారత్--శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించే యువ సంగమ్' కార్యక్రమం లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి**
5. **రాష్ట్రంలోని పాఠశాలలకు ఏల్లుండి నుంచి ఒంటిపూట బడులు ప్రారంభమవుతాయని విద్యాశాఖ డైరెక్టర్ వి. విజయరామరాజు వెల్లడించారు.**

==========================

**రాష్ట్రం లో** గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఆందోళన చెందకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులకు సుచించారు. పలువురు మంత్రులతో ఈరోజు ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్రంతో సమన్వయం చేసుకుని సమస్య లేకుండా ప్రయత్నం చేయాలని మంత్రులను ఆదేశించారు. హోటళ్లతో సహా భాగస్వామ్య పక్షాలతో మాట్లాడి.. వాస్తవ పరిస్థితికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించాలని మంత్రులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

--------------------------

ఎన్టీఆర్ జిల్లాలో వంట గ్యాస్‌కు కొరత లేదని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లిలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) బాట్లింగ్ ప్లాంటును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్లాంటు అధికారులతో సమావేశం నిర్వహించి ప్లాంటు కార్యకలాపాలను, ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో అవసరానికి సరిపడా ఎల్పీజీ సిలిండర్ల నిల్వలు ఉన్నాయని, సరఫరా ప్రక్రియ కూడా సజావుగా కొనసాగుతోందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించేందుకు ప్రయత్నించినా, బ్లాక్ మార్కెటింగ్ కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలియజేస్తూ..

వాయిస్ 34 సెకన్స్

---------------------------

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఈరోజు పర్యటిస్తున్నారు. పాడేరు నియోజకవర్గం, నందిగరువు, ఓనూరు గ్రామాల్లో ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ తదితర పథకాలల్లో నిర్మించిన రోడ్లను ఆయన పరిశీలించారు. ఓనూరు జంక్షన్ నుంచి నందిగరువు గ్రామం వరకు నిర్మించిన 2.4 కిలోమీటర్ల రహదారిని కాలి నడకన వెళ్లి పరిశీలించారు. అనంతరం ఓనూరు అంగన్‌వాడీ సెంటర్ లో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం కిట్స్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో మాట్లాడి వారికి పుస్తకాలు, బ్యాగ్ లను ఉప ముఖ్యమంత్రి అందజేశారు.

---------------------------

ఆమరావతి లో ఈ సంవత్సరం జూన్ నాటికి అధికారులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల నివాసాలు పూర్తవుతాయని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం అనంతవరం, నెక్కల్లులో ఆయన ఈరోజు పర్యటించారు. ఈ సందర్భంగా అనంతవరం లో నిర్వహించిన గ్రామసభలో మంత్రి పాల్గొన్నారు. గ్రామంలో పలు సమస్యలపై ప్రజల నుంచి మంత్రి అర్జీలను స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ నిర్మాణాలు, మౌలిక వసతులను గ్రామస్థులకు మంత్రి నారాయణ వివరించారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలకు ఈనెల 16వ తేదీ నుంచి ఒంటిపూట బడుల విధానాన్ని అమలు చేస్తున్నట్లు విద్యాశాఖ డైరెక్టర్ వి. విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల 45 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు తరగతులు జరుగుతాయని వివరించారు. విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు మధ్యాహ్న భోజనాన్ని కొనసాగించాలని పాఠశాల విద్యాశాఖ సంబంధిత అధికారులకు సూచించింది.

---------------------------

ఏక్ భారత్--శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే 'యువ సంగమ్' కార్యక్రమం 6వ దశలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. దేశవ్యాప్తంగా యువత ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కేంద్ర విద్యాశాఖ తెలిపింది. ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొంది. యువ సంగమ్ లో పాల్గొనాలనుకునే విద్యార్థులు ebsb.aicte-india.org వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని సూచించింది. ఈ కార్యక్రమం ద్వారా యువతకు దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సాంస్కృతిక సంప్రదాయాలు, వారసత్వం వంటి అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని కేంద్ర విద్యాశాఖ పేర్కొంది.

---------------------------

విశాఖపట్నం జిల్లా సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారిని హోంమంత్రి వంగలపూడి

అనిత ఈరోజు దర్శించుకున్నారు. సింహాచలం చందనోత్సవం, కల్యాణోత్సవం ఏర్పాట్లపై అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. సామాన్య భక్తుల దర్శనానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం జరిగే చందనోత్సవం, కల్యాణోత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో గ్యాస్ సంక్షోభం లేకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను ప్రజలు నమ్మవద్దని ఆమె సూచించారు.

---------------------------

తిరుపతిలోని హస్తకళారామంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హస్తకళా ఉత్పత్తుల మేళాకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. యువతకు విశ్వకర్మ యోజనతో పాటు మీవీజు అవకాశాలపై ఈరోజు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ద్వారా యువ పారిశ్రామికవేత్తలను తయారు చేస్తోందని మీవీజు అసిస్టెంట్ డైరెక్టర్ శివరాం ప్రసాద్ తెలియజేస్తూ..

వాయిస్ 34 సెకన్స్

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈ నెల 27 వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

జార్ఖండ్ నుండి విదర్భ వరకూ ఛత్తీస్‌గఢ్ మీదుగా సగటు సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి, ఆగ్నేయ దిశగా గాలులు వీస్తున్నాయని పేర్కొంది. వీటి ఫలితంగా ఆంధ్రప్రదేశ్, యానాంలలో ఈ రోజు పొడివాతావరణం నెలకొనే అవకాశం ఉందని తెలిపింది. రానున్న 4 రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలలో గణనీయమైన మార్పు ఉండదని వెల్లడించింది.

---------------------------

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు అశోక్ నగర్ లోని కె.పి.డి.టి హై స్కూల్ లో ఈనెల 17వ తేదీన ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్. జితేంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో సుమారు 20 కంపెనీల పాల్గొంటాయని 14 వందల 97 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన చెప్పారు. పదవ తరగతి, ఇంటర్, ఐ.టి.ఐ, డిప్లొమా, డిగ్రీ వంటి విద్యార్హతలు ఉండి 18 నుండి 35 సంవత్సరాల వయసు గల వారు అర్హులని వెల్లడించారు.

---------------------------

విజయవాడ తాడిగడపలోని బీసీ సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయంలో బీసీ రక్షణ చట్టం రూపకల్పనపై మంత్రుల సమావేశం జరుగుతోంది. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవితతో పాటు మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, కింజరాపు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, వాసంశెట్టి సుభాష్,

కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్  పాల్గొన్నారు. మరో వైపు విజయవాడలోని పౌరసరఫరాల శాఖ భవన్‌లో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో గ్యాస్ సరఫరా అంశంపై భేటీ కొనసాగుతోంది.

======================